క్లుప్తంగా

‘పేదలకు ఇందిరమ్మ ఇళ్లు’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ పరిధిలో గిరిజనుల కోసం ప్రత్యేక కోట ద్వారా అత్యధిక ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో పీఎంఆర్సీ సమావేశ మందిరంలో 980 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్‌లతో కలిసి పంపిణీ చేశారు. తహసీల్దార్ ప్రవీణ్, మండల అభివృద్ధి అధికారి రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో సోమవారం ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాజుబాయి, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

మహిళా సంఘాలను చైతన్య పరచాలి

జైనథ్: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వివిధ గ్రామాల వీవోఏలకు సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏపీఎం సుజాత మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా సంఘాల తోడ్పాటుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో కట్టించేందుకు ప్రతీ ఒక్కరు దోహదపడాలని కోరారు. ఐకేపీ సీసీలు వాసురెడ్డి, గంగారాం, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

నవరాత్రులకు సిద్ధమవుతున్న గణనాథులు



గణేశ్ విగ్రహానికి రంగు వేస్తున్న కార్మికుడు

ఇంద్రవెల్లి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తుండడంతో గణనాథ విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. మండల కేంద్రంలో గణపతి విగ్రహాలు తయారు చేసే వ్యాపారుల విగ్రహాల తయారీని వేగవంతం చేశారు. ఉత్సవ కమిటీల సభ్యులు, భక్తులు తరలివచ్చి తమకు కావాల్సిన గణేశ్ విగ్రహాలను ముందుగా బుక్ చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులు



మట్టి గణపతులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సాత్నాల: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని ప్రధానోపాధ్యాయురాలు శశికళ అన్నారు. భోరజ్ మండలం పిప్పర్‌వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మట్టి గణపతుల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి గణపతుల తయారీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులు ముఖ్యమైనవన్నారు. ఏఏ పీఎస్ చైర్మన్ ఆశమ్మ, ఉపాధ్యాయులు అభయ్ కుమార్, స్వాతి, అనిత, నారాయణ, మాధురి, మాళవిక, జైకర్ తదితరులు పాల్గొన్నారు.

మారిన ఓటర్ బూత్.. కలెక్టర్‌కు ఫిర్యాదు

ఇచ్చోడ: మండలంలోని అడేగామ బి మాజీ సర్పంచ్ కదం వనిత, ఆమె భర్త కదం సుభాష్‌రావుల ఓట్లను అడేగామ బిలోని 140వ బూత్ నుంచి ఇచ్చోడ మండల కేంద్రంలోని 137వ బూత్‌కు ఈనెల 18న గుర్తు తెలియని వ్యక్తులు మార్చగా సుభాష్‌రావు రెండు రోజుల క్రితం కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు చేశారు. పోలింగ్ బూత్ మార్పుకోసం వీరు దరఖాస్తు చేసుకోకున్నా వీరి ఓట్లను మార్చేశారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఫోర్జరీ పత్రాలతో పోలింగ్ బూత్ మార్చినట్లు గుర్తించామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో తిరిగి వారి ఓట్లను 140 పోలింగ్ బూత్‌లోకి మార్చినట్లు పేర్కొన్నారు.

సగం సీట్లు ఖాళీ!



మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహం

- సంక్షేమ హాస్టళ్లలో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి
- విశాలమైన గదులు, సకల సదుపాయాలు
- నాణ్యమైన భోజన మెనూ ఉన్నా తగ్గుతున్న సంఖ్య
- తాంసిలో 29, కప్పర్లలో 50 మంది మాత్రమే చేరిక

తాంసి: కొన్నేళ్ల క్రితం వరకు ప్రభుత్వ వసతి గృహాల్లో సీటు పొందాలంటే చాలా కష్టంగా ఉండేది. నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉండి, అన్ని సర్టిఫికెట్లు ఉన్నప్పటికీ వసతిగృహాల్లో చేరే విద్యార్థులకు పోటీ అధికంగా ఉండేది. అలాంటి వసతి గృహాల్లో ఏటా విద్యార్థులు సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ప్రతీ సంవత్సరం వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో విద్యార్థుల ప్రవేశాలు ఉండటం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నా విద్యార్థులు వసతిగృహంలో చేరడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో వసతి గృహాల్లో చాలా సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. కనీసం సగం మంది విద్యార్థులు కూడా చేరకపోవడంతో హాస్టల్ వార్డెన్‌లు విద్యార్థులను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

మండలంలో రెండు వసతి గృహాలు..

మండలంలో రెండు ఎస్సీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. మండల కేంద్రంలో ఒకటి, కప్పర్ల గ్రామంలో మరొకటి ఉన్నాయి. ఈ హాస్టళ్లు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాలు సువిశాలంగా ఉండి, అన్ని రకాల వసతులు ఉన్నప్పటికీ విద్యార్థులు లేక బోసిపోయినట్లుగా కనిపిస్తున్నాయి. రెండు హాస్టళ్లలో కలిపి ప్రస్తుతం 79 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మండల కేంద్రంలోని వసతి గృహంలో 100 సీట్లు ఉండగా 29 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కప్పర్ల హాస్టల్‌లో సైతం 100 సీట్లు ఉండగా 50 మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో ఒక్కో వసతి గృహంలో 70 నుంచి 80 మంది వరకు విద్యార్థులు ఉండేవారు.

పెరగని సంఖ్య..

గురుకుల పాఠశాలలో ఏ విధమైన భోజనం పెడుతున్నారో అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లో మెనూ మార్చి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. ఆదివారం చికెన్‌తో పాటు వారానికి రెండు సార్లు గుడ్డు, ప్రతీరోజు ఉదయం వివిధ రకాలుగా టిఫిన్‌లను అందిస్తున్నారు. ప్రతీనెల కాస్మోటిక్ చార్జీలు సైతం ఇస్తున్నారు. అయినా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. గురుకుల పాఠశాలలు పెరగడంతో చాలా విద్యార్థులు వాటిల్లో చేరడానికి ఆసక్తి చూపుతుండడంతో వసతి గృహాల్లో సంఖ్య తగ్గుతున్నట్లు తెలుస్తోంది. గురుకులాల్లో రెసిడెన్షియల్ హాస్టల్, పాఠశాల ఒకేచోట ఉండటంతో తల్లితండ్రులు సైతం తమ పిల్లలను గురుకులాల్లో చేరుస్తున్నారు.

అన్ని రకాల వసతులు..



గతంలో హాస్టల్‌లో చేరడానికి విద్యార్థులు పోటీ పడి ప్రవేశాలు పొందేవారు. ప్రస్తుతం విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. దీంతో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. ప్రస్తుతం హాస్టల్‌లో 29 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే గ్రామాల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. సౌకర్యాలు, భోజనం మెనూ తెలియజేసి హాస్టల్‌లో చేరాలని కోరాం.

– సురేందర్, హాస్టల్ వార్డెన్, తాంసి

‘గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం’



సాత్నాల: ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు



ఇచ్చోడ: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సాత్నాల: రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతం రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని, పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగే వరకు తమ పోరాటం ఆగదని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగె బ్రహ్మానందం అన్నారు. సోమవారం భోరజ్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ రెడ్డి, మండల ప్రెసిడెంట్ లోకకరుణాకర్ రెడ్డి, భోరజ్ మండల అధ్యక్షుడు గాజుల సన్ని, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: ప్రజలను మభ్యపెట్టి పాలన చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ డిమాండ్ చేశారు. బీజేపీ మహాధర్నా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కొద్ది సేపు బైఠాయించి నిరసన తెలిపారు.

ఇచ్చోడ: ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మణ్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ సత్యనారాయణరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, నాయకుడు అంబెకర్ పాండురంగ్, కేంద్రే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాంసి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ పార్టీ మండల కన్వీనర్ చంద్రకిరణ్ అన్నారు. మండల కేంద్రంలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ రాజు, నాయకులు సంతోష్ రెడ్డి, సదానంద్, అరుణ్, గంగారం ఉన్నారు.

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ అన్నారు. సోమవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు ఆరెల్లి రాజలింగు, శివకుమార్, హనుమంత్‌రావు, రాజేశ్వర్, రాధిక రాథోడ్, తుకారం, రాజువర్ధన్, దీపక్‌సింగ్‌షెకావత్, రాథోడ్ భీంరావ్, మేస్రం జైరాం తదితరులు ఉన్నారు.

తలమడుగు: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు నక్క ధనుంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ రాజ్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు.

భీంపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు అంకం అశోక్ డిమాండ్ చేశారు.

బోథ్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ఎండగట్టారు.

బేల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆందోళన చేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

సాత్నాల: భారీ వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు అస్తక్ సుభాష్ అన్నారు. సోమవారం తహసీల్దార్ జాదవ్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన లేక, పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ కాక రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. పోతురాజు రమేశ్, ఎం.సురేశ్, రాథోడ్ రోహిదాస్, మహేశ్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ దినేష్, పంద్రా రాము, స్వామి, తిరుపతి, బాలు, సంతోష్, రవి, సుధాకర్, రేణుక బాయ్ తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న, కొత్త శంకర్, అల్కే గణేశ్, నానం రమణ, చట్ల ఉత్తం, నర్సయ్య, వినాయక్, ఈశ్వర్, నాగోరావ్, మురళి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జైనథ్ మండల అధ్యక్షుడు ఏనుగు రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: సాథ్‌నంబర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందజేశారు. 44వ జాతీయ రహదారిపై ఉన్న సాథ్ నంబర్‌లో బస్‌షెల్టర్ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, గ్రామానికి సింగిల్ ఫేజ్ విద్యుత్‌తో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అంగన్‌వాడీ టీచర్ లేక చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందడం లేదని పేర్కొన్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి అన్నపూజ

బోథ్: పట్టణంలోని శ్రీ శివభక్త మార్కండేయ మందిరంలో శ్రావణ మాసం ముగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. నెల రోజుల పాటు జరిగిన శ్రావణ మాసోత్సవాలు సోమవారంతో ముగిశాయి.

కొనుగోళ్లకు సిద్ధం

బోథ్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రభుత్వం ముందుచూపుతో గోదాంలలో నిల్వ ఉన్న సోయాను ఖాళీ చేయిస్తామని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తెలిపారు. త్వరలో రానున్న సోయా పంట కొనుగోళ్లకు వీలుగా గోదాంలను సిద్ధం చేస్తున్నామన్నారు.

ఆర్థికసాయం అందజేత

బోథ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో ఎకనామిక్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల మరణించిన అశోక్ కుటుంబానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.93,460 ఆర్థిక సాయం చేశారు. కాలేజ్ ప్రిన్సిపాల్ అనురాధ, అశోక్ సతీమణికి, పిల్లలకు సాయం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

పొలం బాటలు నిర్మించాలని వినతి

బోథ్: తమ పొలాలకు దారులు నిర్మించాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన రైతులు సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌కు వినతిపత్రం అందించారు. పంటల రవాణా, రోజువారీ ప్రయాణానికి పడుతున్న కష్టాలను రైతులు ఆయనకు వివరించారు.

మీసేవ ఆపరేటర్‌కు సన్మానం

బేల: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 13 ఏళ్లుగా విధులు నిర్వహించి తాంసి మండలానికి బదిలీపై వెళ్తున్న మీ సేవ ఆపరేటర్ సీతవార్ శ్రీనివాస్‌కు శాలువాలు కప్పి, మెమోంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ రఘునాథ్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ వామన్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండీ సాజిద్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగాలు ప్రబలకుండా జాగ్రత్త వహించాలి

భీంపూర్: వర్షాకాలం నేపథ్యంలో అంటు రోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గ్రామంలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో రసాయనాలను పిచికారీ చేశారు.

విద్యుదాఘాతంతో గాయాలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన కౌశిక్ అనే యువకుడు ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. బిల్డింగ్ మొదటి అంతస్తు నుంచి విద్యుత్ తీగలపై పడిపోవడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

నార్నూర్: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో పైలట్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.

లబ్ధిదారుల ఎంపికపై విచారణ జరిపించాలి

కైలాస్‌నగర్: వార్డు, గ్రామసభలు నిర్వహించకుండా, ఇందిరమ్మ కమిటీల ఆమోదం లేకుండా చేపట్టిన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై దర్యాప్తు చేయించి అర్హులైన వారికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. పార్టీ ఆదిలాబాద్ పట్టణ, ఆదిలాబాద్ రూరల్, బేల మండల కమిటీ నాయకులు జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవిని వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు.

నేవీలో ఉద్యోగం.. విద్యార్థికి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమ్ర శశికాంత్ ఇండియన్ నేవీలో ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం విద్యార్థిని శాలువాతో సన్మానించారు.

పత్తి అమ్ముకునే అవకాశం ఇవ్వాలి

ఆదిలాబాద్: మహారాష్ట్రలోని కిన్వట్, మాహోర్ తాలుకా రైతులకు ఆదిలాబాద్ జిల్లాలో పత్తి అమ్ముకునే అవకాశం కల్పించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను బీజేపీ కిసాన్ మోర్చా కిన్వట్ అధ్యక్షుడు బజరంగ్ రెడ్డి సింగద్వార్, ఆదిలాబాద్ మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఎల్టి శేఖర్ రెడ్డి విన్నవించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందించారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న సాధన

బజార్‌హత్నూర్: ఇటీవల భారీ వర్షాలు కురవడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున, వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, ప్రసూతి గదిని, ఫార్మ గదిని, జనరల్ వార్డును పరిశీలించారు. రోగులు, గర్భిణులతో మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో, వసతిగృహాల్లో, పాఠశాలల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు భీంరావ్, చట్ల శిల్ప, అలేఖ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంట నష్టం సర్వే



పంటలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఇంద్రవెల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన పంటల సర్వే కొనసాగుతోంది. వ్యవసాయాధికారి రాథోడ్ గణేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పంట సర్వేలో ఏఈఓలు తమ క్లస్టర్ల పరిధిలోని చేనుల్లో నష్టపోయిన పంటలను సర్వే చేస్తున్నారు. సోమవారం మండలకేంద్రంతో పాటు మండలంలోని గిన్నేర, బిక్కుతండా, వాల్గొండ, గోపాల్‌పూర్, దస్నాపూర్, ముత్నూర్, దనోరా(బి) గ్రామాల్లో సందర్శించి వర్షానికి నష్టపోయిన పంట వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏఈఓలు కరుణ, వీరా, వివేక్, నవతేజ్ తదితరులు ఉన్నారు.

సాత్నాల: భోరజ్ మండలంలో భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ఆయా ప్రాంతాలను, వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి అష్రఫ్ మాట్లాడుతూ సోమవారం గిమ్మ, కామాయి, భోరజ్, తరోడ, గణేశ్‌పూర్ గ్రామాలలో 380 ఎకరాలలో సర్వే నిర్వహించామన్నారు. దాదాపు 600 ఎకరాలలో సర్వే నిర్వహించాల్సి ఉందని, రైతుల పంట పొలాలకు వచ్చి వివరాలను నమోదు చేసుకుంటామన్నారు. వీరి వెంట ఏఈఓలు, రైతులు ఉన్నారు.

వరద బాధితులకు షెల్టర్ కిట్ల పంపిణీ



బాధితులకు షెల్టర్ కిట్లు అందజేసిన సభ్యులు

ఆదిలాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ప్రభావంతో నష్టపోయిన నిరుపేదలకు సోమవారం బాల వికాస డిజస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్, రణదీవెనగర్ కాలనీల్లో 160 షెల్టర్ కిట్లను పంపిణీ చేశారు. మేనేజర్ శివరాం మాట్లాడుతూ భారీ వర్షాలతో నిరుపేదలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రూ.4లక్షల విలువ చేసే షెల్టర్ కిట్లను అందజేసినట్లు తెలిపారు. ఐదేళ్లుగా భారీ వర్షాలతో నష్టపోయిన 10వేల మంది బాధితులకు అమెజాన్ కార్డు సహాయంతో అండగా నిలిచామన్నారు. జిల్లా కోఆర్డినేటర్ ప్రసూన్ రెడ్డి, నరేందర్, సామాజిక కార్యకర్తలు ఆదిత్య ఖండేష్కర్, సాయికృష్ణ గుండావార్, వేణు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బేల: మండలకేంద్రంలోని పాత బస్తీలోని నిరుపేద వరద బాధితులకు సోమవారం రూ.లక్ష 40వేల విలువ గల 40షెల్టర్ కిట్లను బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఆమెజాన్ డొనేట్ కార్డు సహకారంతో అందజేశారు. కిట్లను వరద బాధితులకు సంస్థ మేనేజర్ శివరాం పంపిణీ చేశారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రసూన్‌రెడ్డి, నరేందర్, సామాజిక కార్యకర్తలు సాయికృష్ణ, గుండవార్ ప్రవీణ్, రాపెల్లి శివకుమార్, గుండవార్ ప్రశాంత్, ఆకాష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ బండారి రాజు

నేరడిగొండ: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ బండారి రాజు హెచ్చరించారు. సోమవారం నేరడిగొండ పోలీస్‌స్టేషనలో కోర్టికల్, లింగట్ల గ్రామాలకు చెందిన స్థానిక నాయకులు, గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ రెండు గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రూపు తగాదాలకు ప్రజలు దూరంగా ఉండాలని తెలిపారు. గణపతి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అల్లర్లు సృష్టించినా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఇరు గ్రామాలకు చెందిన 20 మందిని బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్సై ఇమ్రాన్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

నేరడిగొండ: వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై ఇమ్రాన్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే వినాయక నవరాత్రి ఉత్సవాల్లో శాంతిభద్రతలను పాటిస్తూ ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఎంఏ కలీమ్, ఎంపీడీవో శేఖర్, విద్యుత్ శాఖ ఏఈ నాగేంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

సాత్నాల: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సువాసిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భోరజ్ మండలంలోని మాండగడ, డోలారా గ్రామాలలో సోమవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ఆమె మాట్లాడుతూ రైతుకు ఎకరానికి ఇప్పటికే 30 వేలకు పైగా పెట్టుబడి ఖర్చయిందని, పంట పూర్తిగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. పెన్‌గంగా పరీవాహక ప్రాంతాల్లో రైతులు ప్రతీసారి వరదలకు నష్టపోతున్నారని, పెన్‌గంగా ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట రైతులు ఉన్నారు.

దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు.

ల్యాప్‌ట్యాప్, చెక్కులు పంపిణీ..

ఉట్నూర్ మండలంలోని గిరిజన విద్యార్థికి ల్యాప్‌ట్యాప్ పంపిణీ చేసినట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. హస్నాపూర్ గ్రామానికి చెందిన మహేందర్ సింగ్‌కు జేఈఈ మెయిన్స్ చదువుల కోసం ల్యాప్‌ట్యాప్ అందజేశారు. మరో ఎనిమిది మంది గిరిజన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం నిమిత్తం చెక్కులు పంపిణీ చేశారు.

‘సురవరం’ మృతిపై సంతాపం

బోథ్: సీపీఐ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల మండల సీపీఐ నాయకులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వధువు వివాహ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899